క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం

అల్లవరం: శాసనమండలి ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారిగా స్వగ్రామం విచ్చేసిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ని మండల టీడీపీ అధ్యక్షుడు, దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ తోట శ్రీదేవి గోడిలోని ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాంద్రేగుల వాణి అచ్యుతాంబ, తోట నరసింహరావు, దొమ్మేటి ముత్యాలరావు, కడలి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవిపై హర్షం

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిందని నడిపూడిలో జరిగిన మాదిగ దండోరా సమావేశంలో మాదిగ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తమను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్న టీడీపీ, జనసేనలకు మాదిగలు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాదిగ సంఘ నేతలు క్రాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, చేట్ల సత్యనారాయణ, మంద వెంకటేశ్వరరావు, ఎవరపు వెంకటేశ్వరరావు, మంద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడికి సత్కారం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీగా ఎన్నికైన ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావును స్థానిక కౌండిన్య నగర్ శ్రీరామ మందిరం కమిటీ పెద్దలు గురువారం ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించిన అనంతరం సూర్యనారాయణరావును సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోల జాబితా విడుదల

యానాం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాల్సిన ఫొటోల జాబితా వివరాలను పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్, రాష్ట్రపతి, ప్రధాని, లెఫ్టినెంట్ గవర్నర్, సీఎం రంగసామి పోర్టరైట్ ఫొటోలను ప్రదర్శించాలని ఆదేశాలు జారీచేశారు.

'అముడా'పై నేడు చర్చా వేదిక

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) ఏర్పాటు నేపథ్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో శుక్రవారం చర్చా వేదిక నిర్వహిస్తున్నారు. కోనసీమ కన్జ్యుమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ (కోకోఫెడ్) ఆధ్వర్యాన మధ్యాహ్నం 2 గంటలకు ఈ చర్చా వేదిక జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ అరిగెల బలరామమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ సంఘాల ప్రతినిధులు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్: జిల్లా విశ్వబ్రాహ్మణ, స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బులియన్ మార్కెట్‌లోని కామాక్షి ఏకాంబరేశ్వరీదేవి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి తమ వంతుగా చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తాళాబత్తుల అప్పలాచార్యులు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్యాసయ్యదాసులు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, అనుపోజు భగవాన్, తాళాబత్తుల లక్ష్మణరావు, తాళాబత్తుల నాగు పాల్గొన్నారు.

నేడు జీజీహెచ్‌లో కిడ్నీ వైద్య పరీక్షలు

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రికి ఈనెల 31వ తేదీ శుక్రవారం పుదుచ్చేరి ఇందిరాగాంధీ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కిడ్నీ వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ వస్తున్నారని ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ వి.యామిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ ఆసరా సమావేశం స్థల పరిశీలన

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలో ఈ నెల 4న వైఎస్సార్ ఆసరా సమావేశానికి అవసరమైన స్థలాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ముందుగా నడవపల్లి రామాలయంలో సీతారాముల్ని దర్శించుకున్నారు. అనంతరం కాట్రేనికోనలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ వస్త్ర వాపారి గ్రంధి నాగేశ్వరరావును పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు, జగడం బాలయ్య తదితరులున్నారు.



యానాం కనకాలపేటలో కల్యాణానికి హాజరైన భక్తజనం



విద్యుత్ దీపాల వెలుగుల్లో అగ్రహారం రామాలయం



విలసవిల్లిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



నడవపల్లిలో రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

- వాడవాడలా మారుమోగిన తారక మంత్రం
- పల్లకీ, రథాల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపులు

అమలాపురం టౌన్: అమలాపురం నియోజక పరిధిలో సుమారు 60 గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. గురువారం శ్రీరామనవమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో రామాలయాలు కిక్కిరిసిపోయాయి. ఇంటింటా, వాడవాడలా తారకరామ మంత్రం మారుమోగింది. అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారం సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం మురమళ్ల దేవస్థానం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, సుబ్బలక్ష్మి దంపతుల కర్తలుగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో రథోత్సవం చేశారు.

ముమ్మిడివరం: శ్రీరామ నవమి వేడుకలు నియోజకవర్గంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఊరువాడా రామాలయాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం వైభవపేతంగా నిర్వహించారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో రామాలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయమే సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి వారి విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయలతో పాటు, పలు పంట కాలువల్లోని పవిత్ర జలాల్లో స్నానమాచరించి కల్యాణ మండపాలకు తీసుకొచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అల్లవరం: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని సీతారాముల కల్యాణం వాడవాడలా వైభవంగా నిర్వహించారు. అవతారమూర్తి శ్రీరాముడు పెండ్లి కుమారుడిగా జానకిదేవిని పెళ్లి చేసుకునే మధుర ఘట్టంలో భక్తులకు దర్శనమిచ్చారు.



అమలాపురం భూపయ్య అగ్రహారంలో జరుగుతున్న సీతారామ కల్యాణం

కొమరగిరిపట్నం పాత బస్టాండ్ వద్ద పంచారామాలయ క్షేత్రంలో సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సామంతకుర్రు, దేవగుప్తం, అల్లవరం, వెదుళ్లపాలెం, కోడూరుపాడు తదితర గ్రామాల్లో శ్రీరామనవమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు బెల్లం పానకాల్ని అందించారు.

ఉప్పలగుప్తం: విలసవిల్ల గ్రామంలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిపించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాల భక్తులు కల్యాణాన్ని వీక్షించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

యానాం: కనకాలపేట గ్రామంలో కొలువైన కోదండరామ స్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక పిల్లారాయవీధిలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రామాలయంలో అన్నసమారాధనకు భారీగా భక్తులు తరలివచ్చారు. చింతావారివీధి రామాలయంలో, అగ్రహారంలోని అతిపెద్ద రామాయంలో, అంబేడ్కర్‌నగర్, దోబీవీధి, కామిశెట్టివారివీధి, దరియాలతిప్ప, మెట్టకూరు తదితర ప్రాంతాల్లో శ్రీరామనవమివేడుకలు ఘనంగా నిర్వహించారు.

యానాంలో జరిగిన శ్రీరామనవమి వేడకల్లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయం వద్ద సీతారాముల కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావును ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. చింతావారివీధిలో కొలువైన రామాలయంలో జరిగిన వేడుకల్లోను మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జార్జిపేటలో ఉన్న సీతారామచంద్రస్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా 108 పూలబుట్టలతో యువతులు, మహిళలు పువ్వులను ఊరేగింపుగా తీసుకొచ్చి కల్యాణ రామునికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్‌ఏఓ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదప్ప తదితరులు సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమలాపురం రూరల్: బండారులంక నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. గంగలకుర్రుకు చెందిన ఓలేటి నరసింహారావు దంపతులు స్వామివారికి రూ.3 లక్షలు విలువచేసే వెండి ఆభరణాలు సమర్పించారు. స్వామివారిని ఎంపీపీ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, తదితరులు దర్శించుకున్నారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, టి.కొత్తపల్లి, పశువుల్లంక, కొమరగిరి తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో సీతారామ కల్యాణాలు ఘనంగా నిర్వహించారు. చలివిడి, వడపప్పు, బెల్లం పానకాలు భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అందించారు. భైరవపాలెం తీర్థాలమొండి గ్రామంలో మత్స్యకారులు కోలాటాలు, భజన కీర్తనల నడుమ సీతారాముల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కాట్రేనికోన: నడవపల్లి రామాలయంలో సీతారాముల్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



జార్జిపేటలో జరుగుతున్న సీతారాముల కల్యాణ మహోత్సవం



ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం



కొమరగిరిపట్నం పంచారామక్షేత్రంలో జరుగుతున్న సీతారాముల కళ్యాణం



ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో జరుగుతున్న సీతారాముల కల్యాణం

అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం విద్యాశాఖ పరిధిలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందిగా సేవలందిస్తున్న ఉద్యోగులకు 2011 సంవత్సరం నుంచి జీతాలు చెల్లించడం లేదని, సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. గురువారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి నమశ్శివాయం సమాధానం చెబుతూ అప్పట్లో ఎటువంటి ప్రభుత్వ ఆర్డర్‌లు లేకుండా ఆయా సిబ్బంది జాయిన్ అయ్యారు. పుదుచ్చేరి ప్రభుత్వం అటువంటి వారిని విధుల నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినా ఇంకా వారిని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఇదే సమస్యపై విద్యాశాఖాధికారిని వివరణ అడిగానని మాజీ మంత్రి వారిని తొలగించొద్దన్నారంటూ బదులిచ్చారని సభ దృష్టికి తీసుకొచ్చారు. 11 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు.



ఎల్జీ తమిళిసై సౌందరరాజన్‌ను సత్కరిస్తున్న స్పీకర్ సెల్వం, ఎమ్మెల్యే అశోక్

2023–24 ఆర్థిక బడ్జెట్ ఆమోదంకు కృతజ్ఞతలు

2023–24 పుదుచ్చేరి పూర్తి స్థాయి బడ్జెట్ ఆమోదించడంపై ఎల్జీ తమిళిసై సౌందరరాజన్‌కు స్పీకర్ సెల్వం, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్‌నివాస్‌కు వెళ్లి ఎల్జీని కలిసి ఆమెను సత్కరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంపై మంత్రులు స్పీకర్ సెల్వంను ఆయన కార్యాలయంలో సత్కరించారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావులు కోరారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దిగజారిందని, దేశాన్ని రక్షించడం కోసం ప్రజలందరూ ఐక్యం కావాలన్నారు.

వినాయక ఆలయంలో చోరీ

అల్లవరం: గోడితిప్ప పంచాయతీ పరిధిలోని గోపాయిలంక ఏటిగట్టుపై కొలువైయున్న శ్రీలక్ష్మీ వినాయక ఆలయంలో బుధవారం తెల్లవారుజామున హుండీ పగులగొట్టి రూ.7 వేలు నగదుని అపహరించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే ఆలయంలో ఈ ఏడాది నాలుగు సార్లు చోరీ జరిగిందని వారు తెలిపారు.

జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడికి సన్మానం

కాట్రేనికోన: కాట్రేనికోన పంచాయతీ తిమ్మాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం తాను చేసిన కృషిని గుర్తించి పదవి వచ్చేలా సహకరించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక అధికారులకు పదోన్నతులివ్వాలి

యానాం: పుదుచ్చేరిలో వివిధ ప్రభుత్వ శాఖల్లోని అధికారులకు పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించాలని స్పీకర్ సెల్వం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీడీసీ, ఏడీపీసీ పద్ధతుల ద్వారా ఆదేశాలివ్వాలన్నారు. 1967 పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం 67 పోస్టులు వస్తే ప్రస్తుతం అవి 94కు పెరిగాయని వాటిని కేంద్ర హోంశాఖ ఆమోదించిందన్నారు. అయితే సంబంధిత అథారిటీ వీటిని 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంచారన్నారు. దీంతో పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో వారికి పని ఒత్తిడి ఎక్కువవుతుందన్నారు. దీనికి స్పందించిన సీఎం రంగసామి మాట్లాడుతూ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వెంకన్న పెళ్లికి ఎదురు సన్నాహాలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాల సందర్భంగా ఎదురు సన్నాహాల కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు కల్యాణ మండప వేదక వద్దకు తీసుకొచ్చి ఎదురు సన్నాహాలు నిర్వహించారు. స్వామి వారి తరపున పట్టణానికి చెందిన అబ్బిరెడ్డి నరేష్ దంపతలు, అమ్మ వారి తరపున అల్లవరానికి చెందిన ఆక్వా రైతు బండిగుప్తాపు పాండురంగ దంపతులు ఎదురు సన్నాహాల్లో కల్యాణ మూర్తులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు యెండూరి వీర రాఘవ, నడింపల్లి వర్మ, కాలే చంటి తదితరులు పాల్గొన్నారు. స్వామి వారిని రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ కుమారుడు డాక్టర్ శ్రీకాంత్, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఎదురు సన్నాహాల్లో పాల్గొన్న స్వామి, అమ్మవార్ల తరపు పెద్దలు

బోడసకుర్రులో రెండు తాటాకిళ్లు దగ్ధం

అల్లవరం: బోడసకుర్రు అయినాలవారి వీధిలో గురువారం ఉదయం రెండు తాటాకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. రామాలయంలో సీతారామ కల్యాణం జరుగుతున్న సమయంలో పొయ్యి నుంచి ఎగసిపడిన మంటలతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఆయా ఇళ్లలోని బట్టలు, పర్నీచర్, డాక్యుమెంట్లు, పాస్‌బుక్‌లు మంటల్లో కాలి బూడిదయ్యాయని, కట్టుబట్టలు మినహా ఏమీ మిగల్లేదని బాధితులు సిద్ధిన నాగేశ్వరరావు, సిద్ధిన నాగవేణి కన్నీరుమున్నీరుగా విలపించారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం ఉంటుందని బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితులను సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి పరామర్శించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా శ్రీరామ్ శోభా యాత్ర

అమలాపురం టౌన్: విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా పట్టణంలో శ్రీరామ్ శోభా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల ప్రతినిధులు మోటారు సైకిళ్లపై జై శ్రీరామ్, జై హనుమాన్ జెండాల రెపరెపలతో పుర వీధుల్లో యాత్రను చేశారు. శ్రీరాముడు ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భజరంగ దళ్ నగర్ ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఉపద్రష్ట శ్రీరామ్, రేలంగి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రను నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతినిధులు

నూకాంబికా ఆలయానికి భక్తుల తాకిడి

ఆలమూరు: చింతలూరులోని నూకాంబికా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీరామనవమి పర్వదినంతో పాటు సెలవు దినం కావడంతో గురువారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు కాగడాలు వెలిగించి అఖండ దీపాలు సమర్పించారు. భక్తుల తాకిడి దృష్ట్యా పోలీసు యంత్రాంగం చింతలూరు జంక్షన్ వద్దే వాహనాలను నిలిపివేశారు. అయినా కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు వరకూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గోశాల–గోపరంధామం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం భక్తుల దాహార్తిని తీరుస్తుంది.



చింతలూరు నూకాంబికా ఆలయ ఆవరణలో క్యూలైన్ల వద్ద భక్తుల తాకిడి

ఎట్టకేలకు డ్రైనేజీకి మోక్షం

అంబాజీపేట: కాలనీ ఏర్పడిన 42 ఏళ్లకు డ్రైనేజీకి మోక్షం కలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మాచవరం శివారు హడ్కోకాలనీలో డ్రైనేజీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత నెల 8వ తేదీన నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కాలనీ వాసులు వివరించారు. దాంతో కాలనీలో ప్రజలకు అత్యంత అవసరమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో గురువారం పనులు ప్రారంభించినట్టు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గత ప్రభుత్వంలో కాలనీలో డ్రైనేజీలు నిర్మిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు మాయ మాటలు చెప్పారే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు చెప్పారు. ఈ ప్రభుత్వంలోనే కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని అభినందనలు తెలిపారు.



హడ్కోకాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

ఆసరా సభను విజయవంతం చేయండి

అమలాపురం రూరల్: బాలయోగి స్టేడియం ఆవరణలో ఏప్రిల్ 3న జరిగే వైఎస్సార్ ఆసరా సభను విజయవంతం చేయాలని ఎంపీడీవో కాశీ విజయప్రసాద్ కోరారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం పీవీవీ రమణి అధ్యక్షతన వీవోఏలు, మహిళా శక్తి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా సభలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా మండలంలోని 1817 డ్వాక్రా గ్రూపులకు రూ.16.34 కోట్ల చెక్కును పంపిణీ చేస్తారన్నారు.

గృహ హింస చట్టాలపై అవగాహన ఉండాలి

యానాం: కేంద్ర ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన గృహ హింస నిరోధక చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని ఆర్‌ఏఓ మునిస్వామి అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రూసా ఈక్విటీ ఇనిషియేషన్ కార్యక్రమంలో భాగంగా ×గృహ హింస నిరోధక చట్టం× అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతమాత అని పిలిచే భారతదేశంలో స్త్రీమూర్తులపై గృహహింస చోటుచేసుకోవడం విచారకరమని, వాటిని చట్టప్రకారం ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. గౌరవ అతిథి ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం, కుటుంబంలో వారి కృషిని అభినందించాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గృహహింసకు వ్యతిరేకంగా విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కోస్టల్‌స్టేషన్ ఎస్ఐ ఎంవీవీ సత్యనారాయణ, రాజేష్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, డాక్టర్ నరేష్, ప్రభాకర్, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గృహహింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

యూడీసీలను పరీక్ష నుంచి మినహాయించాలి

యానాం: యానాంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో యూడీసీలుగా విధులు నిర్వహిస్తున్న తమకు అసిస్టెంట్‌ల ప్రమోషన్‌కై నిర్వహిస్తామంటున్న లిమిటెడ్ డిపార్ట్‌మెంట్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్(ఎల్‌డీసీఈ) నుంచి మినహాయింపు నివ్వాలని కోరుతూ గురువారం యానాం మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూడీసీలకు సీనియారిటీ ప్రాతిపదికన అసిస్టెంట్‌లుగా ప్రమోషన్‌లు ఇచ్చేవారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బేతాలం కుమార్, ఉపాధ్యక్షుడు రెయ్యా శ్రీనివాస్, చింతా రామజోగి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఏఓ మునిస్వామికి వినతిపత్రం ఇస్తున్న మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్